@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | గురువారం 21, మార్చి 2024 | పేజీలు: 04





# అందరి సమస్యలు వింటా..

- గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాధాకృష్ణన్
- ప్రమాణం చేయించిన హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే
- పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, అధికారులు

"కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, అధికారులు, ప్రజా సంఘాలు, సామాన్య ప్రజలకు రాజ్‌భవన్ అత్యంత నిబద్ధతతో నిర్విరామ సహకారం అందిస్తుందని రాష్ట్ర నూతన గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ చెప్పారు. తాను అందరి వాణిని వింటానని, ప్రతి ఆందోళనను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్య ప్రక్రియను ఎల్లవేళలా సమర్థిస్తూ, గౌరవించేలా, అత్యంత శ్రద్ధతో తన విధులను నిర్వర్తిస్తానని ప్రతిజ్ఞ చేశారు. న్యాయం, సమగ్రత, నిష్పాక్షికత సూత్రాలకు కట్టుబడి దృఢ నిబద్ధతతో పనిచేస్తానన్నారు. రాష్ట్రం, ప్రజల అభ్యున్నతికి అత్యంత అంకితభావం, చిత్తశుద్ధితో పని చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర మూడో గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ బుధవారం ఉదయం రాజ్‌భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు."

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి 20:** తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ బాధ్యతలు స్వీకరించారు. రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే.. రాధాకృష్ణన్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం గవర్నర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరించేందుకు తెలంగాణ రాజ్‌భవన్ నిబద్ధతతో ఉందన్నారు. సామాన్య ప్రజల అవసరాలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అధికారులు, ప్రజా సంఘాలు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. గవర్నర్‌గా ప్రతి ఒక్కరి సమస్యలు వింటానని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని రాధాకృష్ణన్ తెలిపారు. గవర్నర్ ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితోపాటు, హరియాణా గవర్నర్ బండారు మిగతా 2లో..





## వైద్యారోగ్యశాఖలో 5,348 పోస్టుల భర్తీకి పచ్చజెండా

### ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి జీవో విడుదల

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి20:** తెలంగాణలో వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలోని 5,348 పోస్టుల భర్తీకి సర్కార్ పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఈ నెల 16వ తేదీనే ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి జీవో విడుదల చేశారు. ప్రజారోగ్యం, ఆయుష్, డీసీఏ, ఐపీఎం, డీఎంఈ, వైద్య విధాన పరిషత్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతులు జారీ చేశారు. ఈ నియామకాలను వైద్యారోగ్య సర్వీసుల నియామక బోర్డు ద్వారా నేరుగా చేపట్టనున్నారు. మిగతా 2లో..




## పాలిసెట్ తేదీ మార్పు

- మే 24కు వాయిదా
- రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ, శిక్షణ మండలి కార్యదర్శి పుల్లయ్య

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి20:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ను వాయిదా వేస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ పేర్కొంది. షెడ్యూల్ ప్రకారం మే 17న పాలీసెట్ నిర్వహించాల్సి ఉన్నది. ఎంట్రెన్స్ మిగతా 2లో..

## అన్నారం వైఫల్యానికి డిజైన్లే కారణం

- మాకు సంబంధం లేదు: నిర్మాణ సంస్థ
- బ్యారేజీ ప్రమాదంలో ఉంది.. రక్షణ చర్యలు చేపట్టాలి..
- శాశ్వత మరమ్మతులు చేయాలి: అఫ్కాన్స్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, మార్చి 20:** కాళేశ్వరం ప్రాజెక్టులోని మరో బ్యారేజీ వైఫల్యంపై నిర్మాణ సంస్థ చేతులెత్తేసింది. డిజైన్ లోపం వల్లే అన్నారం బ్యారేజీ ప్రమాదంలో పడిందని, దీనికి తాము ఎంతమాత్రం బాధ్యులం కాదని అఫ్కాన్స్-విజేత-పీఈఎస జాయింట్ వెంచర్ తెలిపింది. మిగతా 2లో..





## ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన

- జగన్ ఓటమే లక్ష్యంగా ఎన్‌డిఎకు మద్దతు
- లోక్‌సత్తా అధినేత జయ ప్రకాశ్ నారాయణ

**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి-మార్చి20:** ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన కొనసాగుతోందని లోక్‌సత్తా అధినేత జయ ప్రకాశ్ నారాయణ మండిపడ్డారు. ఈ క్రమంలో జగన్‌ను ఓడించడమే లక్ష్యంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ మిగతా 2లో..

## తొలివిడత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

- ఎప్రిల్ 19న జరిగే ఎన్నికలకు నామినేషన్లు షురూ
- 17 రాష్ట్రాలు, 4కేంద్రపాలిత ప్రాంతాలు
- 102 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మార్చి20:** ఏప్రిల్ 19న పోలింగ్ జరగనున్న లోక్‌సభ తొలి విడత ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్ జారీతో బుధవారం నుంచే నామినేషన్‌ల పక్రియ ప్రారంభం అయ్యింది. బీహార్ మినహా తొలి విడత లోక్‌సభ ఎన్నికలు జరిగే మిగితా మిగతా 2లో..




## టిఫిన్ సెంటర్‌లో పేలుడు

- సిలిండర్ పేలడంతో మంటల్లో పూర్తిగా దగ్ధమైన షాపు
- పేలుడు ధాటికి పరుగులు తీసిన జనం

2



## మంత్రి పొన్నం కాల్ రికార్డ్

- సోషల్ మీడియాలో వైరల్
- అధికారిపై చర్యలకు సిఎస్‌కు ఫిర్యాదు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి20:** మంత్రి పొన్నం ప్రభాకర్ కాల్ రికార్డింగ్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం, చర్యలకు సిఎస్‌ను మిగతా 2లో..

## ఎకరాకు రూ. 10,000

- అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం..
- నష్టంపై అధికారులకు ఆదేశాలిచ్చాం
- రుణమాఫీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు: మంత్రి తుమ్మల

2

నిత్య నూతనంగా వెలువడుతూ..
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
సంచలన వార్తా కథనాలతో నిత్యం విశేష పాఠకాధరణ పొందుతున్న, నేటి ఫోకస్ న్యూస్ డిజిటల్ తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారిగా, నియోజకవర్గాల వారిగా, మండలాల వారిగా, మండలాల వారిగా బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు.
9848488596

నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
గురువారం 21, మార్చి 2024

# టిఫిన్ సెంటర్‌లో పేలుడు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి20:**

నగరంలో మరోచోట పేలుడు సంభవించింది. వనస్థలిపురం రైతుబజార్ సమీపంలో పేలుడు సంభవించడంతో శబ్దానికి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వనస్థలిపురం రైతుబజార్ సమీపంలో పెను ప్రమాదం తప్పింది. పెట్రోల్ బంక్ ముందు ఉన్న బ్రెడ్ ఆమ్లెట్ షాప్‌లో బుధవారం సాయంత్రం గ్యాస్ సిలిండర్ పేలింది. పేలుడు శబ్దానికి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంటల్లో షాపు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో.. ఘటనా స్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు. గ్యాస్ సిలిండర్ పేలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రైతుబజార్ సమీపంలో పెట్రోల్ బంక్ ముందు టిఫిన్, స్నాక్స్ షాప్ నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం ఆ షాప్‌లో ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలింది. మంటలు చెలరేగి షాపు పూర్తిగా దగ్ధమైంది. షాప్ నిర్వాహకుడు, స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటల్ని ఆర్పివేశారు. గ్యాస్ సిలిండర్ పెద్ద శబ్దంతో పేలడంతో స్థానికులు భయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు.

# వైద్యారోగ్యశాఖలో 5,348 పోస్టుల భర్తీకి పచ్చజెండా

(మొదటి పేజీ తరువాయి..)

ఇందుకోసం స్థానికత ఆధారంగా ఉన్న ఖాళీలు, రోస్టర్ పాయింట్లు, అర్హతకు సంబంధించిన వివరాలను ఆయా విభాగాల అధిపతుల నుంచి తీసుకోవాలని చెప్పారు. ఆయా వివరాల ఆధారంగా నోటిఫికేషన్ ఇచ్చి నేరుగా ఖాళీలను భర్తీ చేయాలని తెలిపారు.

# పాలిసెట్ తేదీ మార్పు

(మొదటి పేజీ తరువాయి..)

టెస్ట్‌ను మే 24వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ, శిక్షణ మండలి కార్యదర్శి ఏ పుల్లయ్య తెలిపారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు ఏడు దశల్లో నిర్వహించనున్న విషయం తెలిసిందే. తెలంగాణలో నాలుగో విడుతలో ఎన్నికలు జరుగనున్నాయి. నాలుగో విడుతలో మే 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా.. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం కొనసాగనున్నది. 26న నామినేషన్ల పరిశీలన, 29 వరకు ఉపసంహరణకు గడువు ఇచ్చింది.

## రైతులంటే ఎందుకింత చిన్నచూపు?

- ఢిల్లీ ప్రదక్షిణలే తప్ప రైతులపై కనికరం లేదా?
- సీఎంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్:**

రాష్ట్రంలో పంటలు ఎండుతున్నా, వడగళ్లు ముంచెత్తినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేయడం తప్ప రైతుల వైపు కన్నెత్తి చూడటం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'ద్వారా ఆయన సీఎం రేవంత్‌కు పలు ప్రశ్నలు సంధించారు. సీఎంకు రైతుల కన్నీళ్లు, అన్నదాతల ఆర్తనాదాలు వినిపించడం లేదని, ఎన్నికల గోల తప్ప.. కష్టాలు పడుతున్న రైతులపై కనికరం లేదని విమర్శించారు. అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా నిరంతరం రాజకీయాల్లోనే మునిగి తేలుతున్నారని ఆక్షేపించారు. పార్టీ ఫిరాయింపులపై పెడుతున్న శ్రద్ధ పంట నష్టం పరిశీలనపై ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీలోని అధిష్టానం చుట్టూ చక్కర్లు కొట్టీ కొట్టీ.. రైతుల సమస్యలు వినే ఓపిక లేకుండా పోయిందా? అని వ్యాఖ్యానించారు. 'ఎద్దు ఏడ్చిన వ్యవసాయం.. రైతు ఏడ్చిన రాజ్యం'బాగుపడదు అనే సామెతను రాష్ట్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. అన్నదాతలకు జరుగుతున్న అన్యాయంపై తమ పార్టీ బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌తో టచ్‌లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు

- చేరికలు ఖాయమన్న సంకేతాలు
- ఒకటిరెండు రోజులే అంటున్న విప్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,మార్చి20:**

భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ద్వారా గతంలో కెసిఆర్ అనుసరించిన విధానంలో సాగాలని ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. చాలామంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రకటించడంతో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేల గురించి కాంగ్రెస్ నేతలు ఒక్కో సంఖ్య చెబుతున్నారు. మరికొందరెమో బీఆర్ఎస్ఎల్పీ విలీనం అవుతుందని సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ సీఎల్పీని విలీనం చేసిన సంగతి తెలిసిందే. అందుకు కౌంటర్‌గా సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేయబోతున్నారని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీతో 26 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ ఎమ్మెల్యేలు తమ పార్టీ నేతలతో చర్చలు జరిపారని, రేపో, మాపో చేరడం ఖాయం అని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతోన్న ప్రజాపాలనకు ఆకర్షితులై ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేయాల్సిన అవసరం తమకు లేదని బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అందరికీ అందుబాటులో ఉంటారని, ప్రజా సంక్షేమమే తమకు ముఖ్యం అని బీర్ల ఐలయ్య వివరించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా సీఎం రేవంత్ రెడ్డి అందుబాటులో ఉంటారని వెల్లడించారు. తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి 64 మంది సభ్యులు ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీకి 39 మంది సభ్యులు ఉన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కారు ప్రమాదంలో చనిపోయిన సంగతి తెలిసిందే. ఆ స్థానానికి మే 13వ తేదీన ఉప ఎన్నిక జరగనుంది. బీఆర్ఎస్ 38 మంది సభ్యుల్లో 26 నుంచి 30 మంది సభ్యులు తమతో టచ్‌లో ఉన్నారని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు. వీరంతా కాంగ్రెస్ గూటికఇ వస్తారని అంటున్నారు. ఇప్పటికే దనాం నాగేందర్ చేరిపోయారు. మిగతావారు కూడా క్యూకడతారని అంటున్నారు.

# అందరి సమస్యలు వింటా..



(మొదటి పేజీ తరువాయి..)

దత్తాత్రేయ, మంత్రి కొండా సురేఖ, పలువురు ఇతర మంత్రులు, ప్రముఖులు హాజరయ్యారు. గవర్నర్ రాధాకృష్ణన్‌కు సీఎం రేవంత్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్‌తో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు ఇతర అంశాలపై చర్చించినట్లు సమాచారం. సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తాతో పాటు ఇతర ముఖ్య అధికారులు నూతన గవర్నర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### భాగ్యలక్ష్మి అమ్మవారికి పూజలు

చార్మినార్: గవర్నర్ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారానంతరం బుధవారం సాయంత్రం చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయాన్ని సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సతీమణితో కలిసి వచ్చిన ఆయనకు ఆలయ ట్రస్టీ శశికళ ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం అద్భుతంగా ఉందని గవర్నర్ అన్నారు. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఆలయానికి వేల సంవత్సరాల చరిత్ర ఉందని, మరో వెయ్యేళ్లు అద్భుతంగా



నిలుస్తుందని చెప్పారు. గర్భాలయంలోకి ప్రవేశిస్తున్న సమయంలో ఒళ్లు పులకరించిందని అన్నారు. అంతకుముందు గవర్నర్‌కు సీఎస్ శాంతికుమారి, కలెక్టర్ హనుమంత్ కె.జండగే, ఇతర అధికారులు, అర్చకులు తూర్పు త్రితల రాజగోపురం ముందు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను గవర్నర్ దర్శించుకున్నారు. ముఖ మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. సీఎస్ శ్రీస్వామి వారి చిత్రపటాన్ని అందజేయగా, ఈవో భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం ఇచ్చారు. శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన శ్రీపుష్ప యాగం వేడుకలో గవర్నర్ పాల్గొన్నారు. ఆలయ ధ్వజ స్తంభం వద్ద మొక్కి, సందర్శకుల పుస్తకంలో తన అనుభూతిని రాసి సంతకం చేశారు.

# తొలివిడత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

(మొదటి పేజీ తరువాయి..)

20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నామినేషన్ దాఖలుకు ఈ నెల 27 వరకు అవకాశం ఇచ్చారు. బీహార్‌లో మాత్రం మార్చి 28 వరకు నామినేషన్‌ల దాఖలుకు అవకాశం కల్పించారు. బీహార్ మినహా మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మార్చి 28న నామినేషన్‌ల స్క్రూటినీ నిర్వహించనున్నారు. బీహార్‌లో మార్చి 30న నామినేషన్‌ల స్క్రూటినీ జరగనుంది. బీహార్ మినహా మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మార్చి 30 నామినేషన్‌ల ఉపసంహరణకు తుదిగడువు. బీహార్‌లో నామినేషన్‌ల ఉపసంహరణకు ఏప్రిల్ 2 వరకు అవకాశం ఇచ్చారు. జూన్ 6తో సాధారణ ఎన్నికల ప్రక్రియ సంపూర్ణంగా ముగియనుంది. తొలి విడతలో 17 రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాల్లోని మొత్తం 102 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. అందులో తమిళనాడులోని మొత్తం 39 స్థానాలు, రాజస్థాన్‌లోని 12 స్థానాలు, ఉత్తరప్రదేశ్‌లోని 8 స్థానాలు, మధ్యప్రదేశ్‌లోని 6 స్థానాలు, ఉత్తరాఖండ్, అసోం, మహారాష్ట్రల్లోని ఐదేసి స్థానాలు, బీహార్‌లోని నాలుగు స్థానాలు, పశ్చిమబెంగాల్‌లోని మూడు స్థానాలు, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయల్లోని రెండేసి స్థానాలు, ఛత్తీస్‌గఢ్, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అండమాన్ నికోబార్ దీవులు, జమ్ముకశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిల్లోని ఒక్కో స్థానం ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 19న తొలి విడత పోలింగ్, జూన్ 1న తుది విడత పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాలతోపాటు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి.

# ఎకరాకు రూ.10,000

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, మార్చి 20:**

రాష్ట్రంలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. పంట నష్టంపై సర్వే చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. నష్టం జరిగిన రైతులందరికీ పరిహారం చెల్లించే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం ఎకరానికి రూ.6 వేల వరకే నష్ట పరిహారం చెల్లించాలని ఉన్నప్పటికీ.. రాష్ట్రప్రభుత్వం రూ.10 వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. సర్వే పూర్తికాగానే అధికారుల నివేదిక ప్రకారం రైతులకు ఆర్థికసాయం చేస్తామన్నారు. గతంలో యాసంగి పంట కాలానికి మే నెల వరకు రైతుబంధు వేసిన సందర్భాలు ఉన్నాయని తుమ్మల అన్నారు. ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉన్నా రైతుల ఖాతాల్లో రైతుబంధు జమచేస్తున్నామని వ్యాఖ్యానించారు. 4-5 ఎకరాల విస్తీర్ణం ఉన్న రైతులకు ఒకటి, రెండు రోజుల్లో నగదు బదిలీ పూర్తవుతుందని చెప్పారు. దీంతో 90‌% రైతులకు రైతుబంధు పంపిణీ పూర్తవుతుందని, మిగిలినవారికి కూడా నగదు బదిలీ చేస్తామని మంత్రి చెప్పారు. వ్యవసాయ రుణాల మాఫీపై ఇంకా ఎలాంటి విధానపరమైన నిర్ణయం తీసుకోలేదని, రూ.2 లక్షల వరకు రుణాలను ఒకేసారి మాఫీ చేయాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చిన సందర్భాలు లేవన్నారు. 2019లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా పంట నష్టాన్ని పరిశీలించి మొదటి కిస్తీ రూ.151 కోట్లు మాత్రమే విడుదల చేశారని, తర్వాత పంట నష్టం జరిగిన బాధితులకు రూ.250 కోట్లు ప్రకటించినప్పటికీ, జీవో విడుదల చేయలేదని మంత్రి గుర్తు చేశారు. తర్వాత పంటనష్టంపై కనీసం నివేదిక కూడా తయారు చేయలేదన్నారు. అలాంటి వ్యక్తులు ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉన్నదని తుమ్మల ఎద్దేవా చేశారు.

# మంత్రి పొన్నం కాల్ రికార్డ్..

(మొదటి పేజీ తరువాయి..)

మంత్రి కోరడం సంచలనంగా మారింది. ఆ ఫోన్ కాల్‌లో మాట్లాడిన హనుమకొండ ఎమ్మార్వో కాల్ రికార్డ్ చేసి స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి పంపించారని విస్తృతంగా ప్రచారం జరిగింది. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పంది స్తూ.. ఎమ్మార్వో పై తెలంగాణ సీఎస్ శాంతికుమారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన ఫోన్ కాల్ రికార్డింగ్ చేసి ప్రతిపక్ష ఎమ్మెల్యే పాడి కౌషిక్ రెడ్డికి పంపించారని, వెంటనే ఆ అధికారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. కల్యాణలక్ష్మి చెక్కులను హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో పంపిణీ చేయించొద్దని మంతరి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేతుల మీదుగా ఒక్క లబ్దిదారునికి కూడా కల్యాణలక్ష్మి చెక్కు అందిచొద్దన్నారు. గతంలో హుజురాబాద్ ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్ ఉంటే.. ఎమ్మెల్సీగా ఉన్న కౌశిక్ రెడ్డి కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేశారని అధికారితో చెప్పారు పొన్నం. అయితే తమకు ప్రస్తుతం ఎమ్మెల్సీ లేదని.. పోటీ చేసి ఓడిన వ్యక్తి ఉన్నాడని చెప్పారు. అధికారులే కల్యాణ లక్ష్మి చెక్కులు పంచాలని ఆదేశాలు జారీ చేశారు. లేదంటే స్థానిక సర్పంచ్ లేదా ఇతర ప్రతినిధులతో పంపిణీ చేయించాలన్నారు.కౌశిక్ రెడ్డి తమ ఎమ్మెల్యే కాదని, అధికార పార్టీకి చెందిన వ్యక్తి అంతకంటే కాదని అధికారితో చెప్పారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో అధికారులకే పూర్తి స్వేచ్ఛనిస్తున్నామంటూ ఫోన్‌కాల్‌లో చెప్పారు. పొన్నం ప్రభాకర్ ఇలా మాట్లడిన తర్వాత ఆ చెక్కులు ఎమ్మెల్యేల చేతుల మీదుగానే పంపిణీ చేశారు. కానీ ఆడియో మాత్రం లీక్ అయింది. తన ఆడియోను రికార్డు చేసి.. బీఆర్ఎస్ నేతలకు ఇచ్చారని పొన్నం ప్రభాకర్ కు తెలిసింది. దీంతో ఆయన ఫైర్ అవుతున్నారు. తమ ప్రభుత్వంలో మంత్రి అనే భావన లేకుండా.. రికార్డు చేసి.. విపక్ష నేతలకు ఇవ్వడంపై ఆయన తీవ్ర ఆగ్ర హం చెందుతున్నారు. సాధారణంగా ప్రభుత్వ కార్యక్ర మాల్లో విపక్ష నేతలకు అవకాశం ఇవ్వరు. ముఖ్యంగా పథకాలన్నీ తమ పార్టీ వారి చేతుల మీదుగానే జరగాలని అనుకుంటారు. గతంలో అదే జరిగింది. అయితే ఆ ఆర్డీవో ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వడంతో వివాదాస్పదమవుతోంది. పార్టీ, ప్రభుత్వానికి మధ్య గ్యాప్ గురించి పార్టీ ఇంచా ర్జ్ దీపాదాస్ మున్సీ చూసుకుంటారని పొన్నం ప్రభా కర్ అన్నారు. నా వాయిస్ రికార్డ్ చేసిన అధికారి మీద చీఫ్ సెక్రెటరికి ఫిర్యాదు చేశానని.. చీఫ్ సెక్ర టరీ చర్యలు తీసుకుం టారన్నారు. ఆస్కార్ అవార్డు పొందాలంటే ఎంత తా పత్రయం పడుతారో నటనలో బండి సంజయ్ అంత తాపత్రయం పడుతున్నార న్నారు. కారణం లేకుండా నా మీద ఆభాండం వేసాడు ..అందుకే నేను సజీవ దహనం కి సిద్ధం అన్నానన్నారు. నిరూపించలేక పో యారు కాబట్టే సైలెంట్ గా ఉన్నారన్నారు. బండి అవినీతి పరుడు కాదని కిషన్ రెడ్డి చెప్పాలని చేశారు.

# ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన

(మొదటి పేజీ తరువాయి..)

కూటమికి మద్దతు ఇస్తున్నామని బుధవారం నాడు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీతో కలిసి బరిలోకి దిగుతామని జేపీ వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరిస్థితులు మరింత దిగజారాయని జయప్రకాశ్ నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కులాల మధ్య పోరాటం జరుగుతోందని వివరించారు. వైసీపీ వైపు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఉంటే, కమ్మ, కాపులు విపక్షాల వైపు ఉన్నారని పేర్కొన్నారు. సుపరిపాలన అంటే సంక్షేమం మాత్రమే కాదన్నారు. అభివృద్ధి చేస్తేనే మంచి పాలన ఇచ్చినట్టు అవుతుందని అభిప్రాయపడ్డారు. అప్పులు తీసుకొచ్చి సంక్షేమం కోసం ఖర్చు చేయడం సరికాదని జేపీ సూచించారు. సంక్షేమమే పాలన అనుకుంటే ఆ దేశం, రాష్ట్రం అధోగతి పాలు కావడం ఖాయం అని హెచ్చరించారు. నేటి బాలలే రేపటి పౌరులు అంటారు. పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించాలని జయప్రకాశ్ నారాయణ సూచించారు. పేదరికం సమూలంగా వెళ్లిపోవాలని, అప్పుడే అభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు. సంక్షేమం అంటే తాత్కాలిక ప్రయోజనాలు అని, అభివృద్ధి అంటే దీర్ఘకాలిక సంపద సృష్టించడం అని జయప్రకాశ్ నారాయణ వివరించారు. ఉపాధి కల్పించి, పెట్టుబడులు అందజేసి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కులాల గురించి ఎక్కువ ప్రస్తావన జరగడం విచారకరం అని జయప్రకాశ్ నారాయణ అభిప్రాయపడ్డారు. కులాలకు అతీతంగా పనిచేసే నేత లేరని పేర్కొన్నారు. గతంలో చాలామంది నేతలు కుల మతాలకు అతీతంగా సమాజం కోసం పనిచేశారని వివరించారు. కొందరు మూర్ఖులు, అజ్ఞానులుగా మారారని ధ్వజమెత్తారు. తప్పు ఎత్తి చూపితే చాలు కులం, మతం, ప్రాంతం పేరు తెరపైకి తీసుకొస్తు న్నారని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న వారు నియంతలా వ్యవహరిస్తున్నారని జేపీ మండిపడ్డారు. మద్దతుగా ఉంటే పూల బాట, ప్రత్యర్థిగా ఉంటే ముళ్ల మార్గంగా మారుస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజలదే.. మన డబ్బు మన హక్కు అని వివరించారు. 'దేశానికి, ప్రజలకు మంచి జరగాలంటే ఆర్థిక ప్రగతి అవసరం. గత ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రగతి మాట లేకుండా పోయింది. ఐదేళ్లలో ఏపీ పేరు దిగజారిపోయింది. పెట్టుబడులు పెట్టేందుకు భయపడే పరిస్థితి వచ్చింది. దోపిడీ చేస్తూ.. సంక్షేమ పథకాలు అమలు చేశామని చెబుతున్నారు. ప్రజా పాలన ఇది కాదు అని' జేపీ ధ్వజమెత్తారు. ఒడిశా కన్నా దారుణంగా ఆంధ్రప్రదేశ్ పరిస్థితి మారిందని జేపీ మండిపడ్డారు. 'ఒడిశాలో రూ.26 వేల కోట్ల రెవెన్యూ ఉంది. అవసరం మేరకు అప్పులు చేస్తారు. హంగు లేదు.. ఆర్భాటం లేదు. ప్రచారం అంతకన్నా లేదు. ఆర్థికాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన సుపరిపాలన అందుతోంది. సంస్కరణలు సాధ్యం కాదు అనేవారు అవినీతి పరులు, అసమర్థులు. వెయ్యి కిలోమీటర్ల తీర ప్రాంతం ఉండి రెవెన్యూ పెంచుకోలేక పోయారు. కుల, మతం, హింస రాజ్యమేలిన ఉత్తర ప్రదేశ్ తీరు కూడా మారింది. ఏపీ పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది అని' జేపీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# అన్నారం వైఫల్యానికి డిజైన్లే కారణం

(మొదటి పేజీ తరువాయి..)

ఈ మేరకు ప్రభుత్వానికి ఇటీవల లేఖ రాసింది. ఇప్పటికే మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి తాము కారణం కాదని, మరమ్మతులు/పునరుద్ధరణ చేపట్టాలంటే మళ్లీ ఒప్పందం చేసుకోవాల్సిందేనంటూ నిర్మాణ సంస్థ ఎల్ అండ్‌టీ తేల్చిచెప్పిన విషయం తెలిసిందే. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోగా.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో భారీగా సీపేజీలు బయటపడ్డాయి. అన్నారం బ్యారేజీ నిర్మాణం 2016 జూన్‌లో చేపట్టగా.. 2019లో పనులు పూర్తయ్యాయి. డిఫెక్ట్ లయబిలిటీ కాలం 2021 డిసెంబరులో పూర్తయింది. అయితే వరద ప్రవాహంతో బ్యారేజీ దిగువ భాగంలో రంధ్రాలు ఏర్పడ్డాయని, పైల్ ్సకు, సీకెంట్ పైల్స్‌కు మధ్య గ్యాప్ ఏర్పడిందని, ఇది అత్యంత ప్రమాదకరమైనదని నిర్మాణ సంస్థ గుర్తు చేసింది. దీనివల్ల భారీగా సీపేజీ ఏర్పడిందని నివేదించింది. బ్యారేజీని కాపాడుకోవాలంటే తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుందని పేర్కొంది. అన్నారం బ్యారేజీ రక్షణ కోసం రెండు రకాల చర్యలను జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎసఏ) సూచించిందని, ఇందులో ఒకటి వానాకాలం లోపు చేపట్టాల్సింది కాగా, మరొకటి శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని తెలిపింది. బ్యారేజీ తీవ్రంగా దెబ్బతిన్నందున.. మోడల్ స్టడీస్ ఆధారంగా శాశ్వత మరమ్మతులే పరిష్కారమని నిర్మాణ సంస్థ నివేదించింది. దీనికోసం బ్యారేజీని ఖాళీ చేయాలని కోరినా చేయలేదని గుర్తు చేసింది. బ్యారేజీ రక్షణ కోసం డిజైన్, డ్రాయింగ్ అందిస్తే.. వాటి ఆధారంగానే రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. తక్షణమే బ్యారేజీని ఖాళీ చేయాలని, ఆ తర్వాత మరమ్మతులు/పునరుద్ధరణ పనులు చేపట్టేదాకా అన్ని గేట్లనూ తెరిచి.. వచ్చిన వరదను వచ్చినట్లే దిగువకు వదిలిపెట్టాలని పేర్కొంది.

# ఇన్‌స్టాగ్రామ్ సేవల్లో అంతరాయం

## గంట పాటు నిలిచిన ఇన్‌స్టాగ్రామ్ సేవలు

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మార్చి20:** ప్రముఖ సోషల్ మీడియా వేదికైన ఇన్‌స్టాగ్రామ్‌లో అంతరాయం ఏర్పడింది. సాంకేతిక కారణం చేత సర్వీసుల్లో ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో యూజర్లు అయోమయానికి గురవుతున్నారు. సర్వీస్ అంతరాయంపై ఫిర్యాదులు చేశారు. పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. పలువురికి ఇన్‌స్టాగ్రామ్ సేవలు నిలిచిపోవడంతో యూజర్లు గందరగోళానికి గురయ్యారు. యూప్ ఓపెన్ కావడం లేదని.. ఇమేజ్ అప్‌లోడ్ కావట్లేదని వాపోయారు. ప్రపంచ వ్యాప్తంగా 20 శాతం మందికి ఈ ఇబ్బందులు తలెత్తినట్లుగా తెలుస్తోంది. సమస్యను పరిష్కరించాలంటూ 'ఎక్స్' వేదికగా కంప్లంట్ చేస్తున్నారు. ఇటీవల కూడా సోషల్ మీడియాకు సంబంధించిన యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సేవలు గంట పాటు నిలిచిపోయాయి. దీంతో యూజర్లంతా అసహనానికి గురయ్యారు. ఎందుకిలా జరిగిందో తెలియక కోట్లాది నెటిజన్లు హైరానా పడ్డారు. త్వరగా సర్వీసులు పునరుద్ధరించాలని పోస్టులు పెట్టారు. అనంతరం కొద్దిసేపటికే ఒక్కొక్కటిగా సర్వీసులను పునరుద్ధరించారు.

# సికింద్రాబాద్‌లో కిషన్ రెడ్డి ఓటమే లక్ష్యం

- దానంను అభ్యర్థిగా నిలిపేందుకు కసరత్తు
- చేరికలతోనూ దూకుడు పెంచుతున్న రేవంత్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి20:** రానున్న వారంత రోజుల్లో తెలంగాణ కాంగ్రెస్లోకి మరిన్న చేరికలు ఉంటాయని భావిస్తున్నారు. ప్రధానంగా పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు చేరబోతున్నారని సంకేతాలు వస్తున్నాయి. తాజాగా చేరిన దానం నాగేందర్‌ను సికింద్రాబాద్ పార్లమెంట్ బరిలో నిలపాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్లు సమాచారం. బిజెపికి చెందిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఓటమి లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. దానం నాగేందర్ అయితేనే కిషన్ రెడ్డిని ఓడించవచ్చని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. అందుకే తొలుత దానంను చేర్చుకునేందుకు పావులు కదిపారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ అధిష్టానంతో చర్చించి ఖరారు చేసే పనిలో రేవంత్ ఢిల్లీ వెళ్లారు. ఇప్పటివరకు కేవలం మాజీలకు మాత్రమే పరిమితమైన వలసలు సిట్టింగ్‌ల వరకు వచ్చేశాయి. రేవంత్ సర్కార్ కూలిపోతుందంటూ చేసిన వ్యాఖ్యలు సీఎం రేవంత్ రెడ్డిని అలర్ట్ చేసినట్టు కనిపిస్తున్నాయి. సిట్టింగ్ ఎంపీలు వెంకటేష్ నేత, పసునూరి దయాకర్, రంజిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. లోక్‌సభ ఎన్నికల ముందు వారు పార్టీ మారడం అంత కలవరపెట్టే విషయం కాదు. కానీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా పార్టీ మారడం పార్టీ పెద్దలను ఆందోళనకి గురి చేస్తోంది. ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ స్పీకర్ కి ఫిర్యాదు చేశారు. మరోవైపు దానం బాటలోనే ఇంకెంతమంది ఎమ్మెల్యేలు పార్టీని వీడతారో అనే భయం బిఆర్ఎస్‌లో మొదలైంది. దానం నాగేందర్‌ను సికింద్రాబాద్ నుంచి ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టాలన్న ఆలోచన కారణంగా ముందుగా పార్టీలో చేర్చుకున్నారని ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకునే ఉద్దేశంతో చాలా మందితో సంప్రదింపులు జరిపినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యేలకు ఉన్న వివిధ రకాల వ్యాపార సమస్యలు, ఇతర అంశాల ఆధారంగా కాంగ్రెస్ నుంచి వస్తున్న ఒత్తిడితో ఎక్కువ మంది పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. దీంతో ఎమ్మెల్యేల కదలికలపై బీఆర్ఎస్ హైకమాండ్ పరిశీలనచేస్తోంది. ఫిరాయిస్తారు అని అనుమానం ఉన్న ఎమ్మెల్యేలను కేటీఆర్, హరీష్ రావులు బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ అధికారంలో లేకపోతే ఎలాంటి బుజ్జగింపులు అయినా పని చేయడం కష్టమన్న వాదన ఉంది. కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీల్ని రెండుసార్లు బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ తమ పార్టీలో విలీనం చేసుకున్నారు. తెలంగాణ ఏర్పడిన కొత్తలో బీఆర్ఎస్‌కు అరకొర మెజార్టీ లభించింది. ఆ సమయంలో ఓటుకు నోటు కేసు

బయటపడటంతో .. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించి.. ఇతర పార్టీల ఎమ్మెల్యేల ను బీఆర్ఎస్ లో చేర్చుకున్నారు కేసీఆర్. ఆ సమయంలో ప్రజల మద్దతు లభించింది. దీనికి సాక్ష్యంగా 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల ద్వారా తేలిపోయింది. పార్టీ ఫిరాయించిన వారిలో ఒకరిద్దరు తప్ప అందరూ గెలిచారు. కానీ రెండోసారి భారీ మెజార్టీతో గెలిచినప్పటికీ కేసీఆర్ మరోసారి కాంగ్రెస్ ఎమ్మెల్యేల్ని విలీనం చేసుకున్నారు. ఆ సమయంలో ప్రజల మద్దతు లభించ లేదు. ఈ ఫిరాయింపు దారులంతా ఇటీవల ఎన్నికల్లో ఓడిపోయారు. రెండు సార్లు కాంగ్రెస్ ఎల్పీల్ని విలీనం చేసుకున్నా ... తమ పార్టీ గెలిచిందని ఫిరాయింపుల ద్వారా ఏమీ జరగదని,రేవంత్ రెడ్డి సీఎంగా ఎన్నికయిన తర్వాత ప్రకటించారు. అయితే తమ ప్రభుత్వాన్ని జోలికి వస్తే మాత్రం ఊరుకునేది లేదన్నారు. అయితే రేవంత్ రెడ్డి ఆ మాటలన్న తర్వాత కూడా ప్రభుత్వ మనుగడపై అదే పనిగా బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్, కడియం శ్రీహరి లాంటి కీలక నేతలు తరచూ లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం ఉండదని చెబుతున్నారు. హస్తం నేతల్ని డిఫెన్స్ లో పడేయడానికి త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది అంటూ వారు చేసిన కామెంట్స్ చేస్తున్నారు. దీనిపై రేవంత్ రెడ్డి ఇటీవలి కాలంలో తీవ్రంగా స్పందిస్తున్నారు. మానవ బాంబులు అవుతామని కూడా ప్రకటించారు. ఇప్పుడు అదే కారణం చూపించి పార్టీ నేతల్ని.. బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తు న్నారని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక పాడి కౌశిక్ రెడ్డి నాలుగు అడుగులు ముందుకు వేసి మరింత రెచ్చగొట్టినట్టు వ్యాఖ్యలు చేయడం గమనార్హం. జంపింగ్‌ల విషయంలో బీ ఆర్ ఎస్ చేసిన తప్పే మీరూ చేస్తారా అంటూ మాజీ ఎంపి వినోద్ ప్రశ్నించారు. మేము తప్పు చేశాము అని స్వయంగా ఒప్పుకున్నట్లు అయింది. కానీ ప్రభుత్వాన్ని పడగొడతాము అని నేరుగా హెచ్చరికలు జారీ చేసిన తర్వాత.. అదే బాటలో వెళ్లకుండా ఎలా ఉంటారన్నది సహజంగా వచ్చే ప్రశ్న. ప్రభుత్వాన్ని కాపాడుకోలేక పోవడం రేవంత్ రెడ్డి చేతకాని తనం అవుతుంది. ఇదే అవకాశాన్ని ఉపయోగించుకుని రేవంత్ రెడ్డి తన ప్రతాపం చూపిస్తున్నారు. అందుకే చేరికలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నారు. మా ప్రభుత్వాన్ని కూల్చాలని ప్రయత్నం చేస్తే ఏం చేయాలో మాకు కూడా వ్యూహం ఉందంటూ రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ చేశారు. మేము మొదలుపెడితే మీ పార్టీలో ముగ్గురు లేదా నలుగురు మాత్రమే మిగులుతారని హెచ్చరించారు. చెప్పినట్టే వలసలకు గేట్లు ఎత్తారు. ఆ విషయం స్వయంగా రేవంత్ రెడ్డే చెప్పారు. ఈ క్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గేట్లు తెరిచింది.

## కొనసాగిన ప్రణీత్ రావు విచారణ

### పలు విషయాల్లో కూపీ లాగిన దర్యాప్తు బృందం

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి20:**ంమాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నాలుగో రోజు బుధవారం కూడా విచారణ కొనసాగింది. విచారణలో భాగంగా ప్రణీత్ రావు నుంచి దర్యాప్తు బృందం కీలక విషయాలు రాబట్టినట్లు తెలుస్తోంది ఈ క్రమంలో ప్రణీత్ రావు మరికొందరు అధికారుల పేర్లను వెల్లడించి నట్లు తెలుస్తోంది. దీంతో.. ఆ అధికారులకు నోటీసులు ఇచ్చి, వారిని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఇక విచారణలో ప్రణీత్ రావు..ఫోన్ ట్యాపింగ్ కోసం విదేశాల నుంచి ప్రత్యేక సాఫ్ట్ వేర్, పరికరాలు తీసుకువచ్చి వాడినట్టు ఒప్పుకున్నారు. అయితే టెలిఫోన్ సర్వీసులకు సంబంధం లేకుండా ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డట్టు గుర్తించారు. అందుకోసం విదేశాల నుంచి ప్రత్యేక సాఫ్ట్ వేర్ తెప్పించింది ఎవరు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కానీ ప్రణీత్ రావు మాత్రం విచారణ ఈ ఫోన్ ట్యాపింగ్ అధికారుల ఆదేశాల మేరకు చేశానని చెబుతుండటం గమనార్హం. దీంతో ఈ కేసులో మరొకందరిక నోటీసులు, కీలక అరెస్టులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ట్యాపింగ్ కేసు నిందితుడు ప్రణీత్‌రావు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ఇవాళ విచారణ జరగనుంది. కస్టడీ విషయంలో సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ పాటించడం లేదని.. కస్టడీ ముగిసిన వెంటనే జైలుకు తరలించేలా ఆదేశాలివ్వాలని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. అలాగే.. తనకు సరైన సదుపాయాలు కల్పించడం లేదంటూ పిటిషన్‌లో ఆరోపించారు.

## లిక్కర్ స్కామ్‌లో అభిషేక్‌కు ఊరట

### మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన కోర్టు

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మార్చి20:** ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో నిందితుడిగా ఉన్న బోయినపల్లి అభిషేక్ రావుకు స్వల్ప ఊరట లభించింది. సుప్రీం కోర్టు బుధవారం అభిషేక్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అభిషేక్ భార్య అనారోగ్యంతో ఉందన్న కారణంగా ఐదు వారాల బెయిల్‌ను మంజూరు చేస్తూ ఆదేశాలిచ్చింది. అభిషేక్‌ను హైదరాబాద్‌కు వెళ్లేందుకు అనుమతించిన సుప్రీం కోర్టు.. పాస్‌పోర్టును సరెండర్ చేయాలని.. ఆయన ఫోన్ నెంబర్ ఈడీ అధికారులకు ఇవ్వాలని, అలాగే ఆయన భార్యకు హైదరాబాద్‌లోనే చికిత్స అందించాలని షరతులు విధించింది. అలాగే మిగిలిన బెయిల్ నిబంధనలను ట్రయల్ కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంటుందని తెలిపింది. ఈ సందర్భంగా.. ట్రయల్ కోర్టు విచారణపై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈడీ కేసుల్లో ట్రయల్స్ జాప్యంపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ట్రయల్స్ జాప్యం జరిగితే నిందితులు నెలల తరబడి జైల్లోనే ఉండాల్సి వస్తుంది కదా? అని ప్రశ్నించింది. అనంతరం ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఏప్రిల్ 29వ తేదీకి వాయిదా వేసింది. లిక్కర్ స్కామ్‌లో 2022 అక్టోబర్‌లో అభిషేక్‌ను సీబీఐ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.



## నోటి శుభ్రతతో ఆరోగ్య భద్రత

**తొర్రూర్ (నేటి ఫోకస్ న్యూస్)మార్చి 20:**

నోటి శుభ్రతతో ఆరోగ్య భద్రత ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ గుండాల మురళీధర్ తెలిపారు. ప్రపంచ ఓరల్ హెల్త్ డే ను పురస్కరించుకొని దంత వైద్యురాలు డాక్టర్ మీరాజ్ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో నోటి ఆరోగ్యం పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్వో పాల్గొని మాట్లాడుతూ అతిగా పండ్లు తోమడం, నాలుక మీద టంగ్ క్లీనర్‌తో శుభ్రం చేయడం ద్వారా నోటికి ఉపయోగపడే బ్యాక్టీరియాలు నశించిపోతాయని గుర్తుంచుకోవాలన్నారు. దంతాలపై పాచి పెరగకుండా చూసుకోవాలని, దంతాలకు సంబంధించిన సమస్యలొస్తే దంత వైద్యున్ని సంప్రదించాలన్నారు. దీని వల్ల నోరు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవచ్చన్నారు. అనంతరం డాక్టర్ మీరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దంతాల శుభ్రత పాటించాలని లేదంటే వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. దంత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఆరు నెలలకోమారు దంత వైద్యున్ని సంప్రదించి పుచ్చు పళ్ళు రాకుండా నివారించుకోవాలన్నారు. నోటిశుభ్రత పాటించకపోతే నోటి క్యాన్సర్, చిగుళ్ల వ్యాధి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బ్రష్, పేస్టులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ జ్వలిత, డాక్టర్ ప్రియాంక, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాజసుకన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## నూతన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రీతమ్‌కు శుభాకాంక్షలు

**ఫోకస్ న్యూస్, కంటోన్మెంట్:**

నూతనంగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నాగరిగారి ప్రీతమ్ కు, మహా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాపాగా నర్సింగ్ రావు మాదిగ, వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాపాగా నర్సింగ్ రావు మాదిగ మాట్లాడుతూ... భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన శిఖరాలను చేరుకోని, జాతి అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో మహా ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ కు ఆత్మీయ సభ ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్యార శ్రీనివాస్, బొడ అశోక్, సుగుణ, తెలంగాణ దండోరా స్టూడెంట్ ఆర్గనైజేషన్ స్టేట్ కోఆర్డినేటర్ మీసాల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్డూ అదుపులేని బంగారం ధరలు

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ,మార్చి20:**

అమెరికన్ సెంట్రల్ బ్యాంక్ సమావేశం నేపథ్యంలో డాలర్ విలువ పెరగడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి వెనక్కు తగ్గింది. ప్రస్తుతం, ఔన్స్ (28.35 గ్రాములు) బంగారం ధర 2,157 డాలర్ల వద్ద ఉంది. మన దేశంలో 10 గ్రాముల ఆర్నమెంట్ బంగారం 22 కేరెట్లు ధర 420 రూపాయలు, స్వచ్ఛమైన పసిడి 24 కేరెట్లు ధర 460 రూపాయలు, 18 కేరెట్ల గోల్డ్ రేటు 340 రూపాయల చొప్పున పెరిగాయి. కిలో వెండి రేటు 300 పెరిగింది. తెలుగు రాష్ట్రాల్లో ఇవాళ బంగారం, వెండి రేట్లు ఇలావున్నాయి. ల్గ÷దరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 60,800 వద్దకు; 24 క్యారెట్ల బంగారం ధర 66,330 వద్దకు; 18 క్యారెట్ల బంగారం ధర 49,740 వద్దకు చేరింది. కిలో వెండి ధర హైదరాబాద్ మార్కెట్‌లో 80,300 గా ఉంది. ఏపీ, తెలంగాణవ్యాప్తంగా ఇదే ధర అమల్లో ఉంది. విజయవాడలో 10 గ్రాముల 22 క్యారెట్ల ఆర్నమెంటు బంగారం ధర 60,800 వద్దకు; 24 క్యారెట్ల బంగారం ధర 66,330 వద్దకు; 18 క్యారెట్ల బంగారం ధర 49,740 వద్దకు చేరింది. ఇక్కడ కిలో వెండి ధర 80,300 గా ఉంది. విశాఖపట్నం మార్కెట్‌లో బంగారం, వెండికి విజయవాడ రేటే అమలవుతోంది. దేశంలోని వివిధ నగరాల్లో పసిడి ధరలు గమనిస్తే ..చెన్నైలో 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 61,350 గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర 66,930 కి చేరింది. కోయంబత్తూలోనూ ఇదే రేటు అమల్లో ఉంది. ముంబయిలో 22 క్యారెట్ల బంగారం ధర ? 60,800 గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర 66,330 కి చేరింది. పుణెలోనూ ఇదే రేటు అమల్లో ఉంది. ఢిల్లీలో 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 60,950 గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర 66,480 గా నమోదైంది. జైపుర్, లఖ్‌నవూలోనూ ఇదే రేటు అమల్లో ఉంది. పసిడి, వెండి, ప్లాటినం సహా అలంకరణ లోహాల ధరలు ప్రతిరోజూ మారుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగే అనేక పరిణామాల మీద ఈ మార్పులు ఆధారపడి ఉంటాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరగడం లేదా తగ్గడం వల్ల మన దేశంలో ధరలు మారుతుంటాయి. ప్రపంచ మార్కెట్‌లో అలంకరణ లోహాల రేట్లు పెరగడానికి, తగ్గడానికి చాలా కారకాలు పని చేస్తాయి. ద్రవ్యోల్బణం, ప్రపంచ కేంద్ర బ్యాంకుల వద్ద బంగారం నిల్వలు, వడ్డీ రేట్ల పెరుగుదల లేదా తగ్గుదల, వివిధ జ్యువెలరీ మార్కెట్లలోని డిమాండ్‌లో హెచ్చుతగ్గులు వంటి ఎన్నో అంశాలు అలంకరణ లోహాల ధరలను ప్రభావితం చేస్తాయి.

## కేంద్ర ప్రభుత్వాన్ని యువత నిలదీయాలి

### ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం డివైఎఫ్ఐ

**అచ్చంపేట నియోజకవర్గ (నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి) ఆర్ భరత్ మార్చి 20:**

యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం పదేళ్లలో యువతను మోసం చేశారని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వర్ధ%శీ% సైదులు అన్నారు. అచ్చంపేట మండల కేంద్రంలోని లింగోటం గ్రామంలో యువకులతో సమావేశం నిర్వహించి నూతన గ్రామ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ఈ సందర్భంగా టివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వర్ధ%శీ% సైదులు సిఐటియు జిల్లా నాయకులు మల్లేష్ మాట్లాడుతూ... యువత కేంద్ర ప్రభుత్వాన్ని ఉపాధి అవకాశాలు ఉద్యోగ అవకాశాలు మోసం చేసిన కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని వారు యువతకు పిలుపునిచ్చారు 2012లో 2.1 శాతం ఉన్న నిరుద్యోగం 2024 నాటికి 6.6 శాతానికి పెరిగిందని వారు గుర్తు చేశారు యువతకి ఉపాధి అవకాశాలు కల్పించవలసిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు మాత్రం రూ. 14.5 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిందని వారు అన్నారు రైల్వే రంగం నుంచి ఎల్ఐసి వరకు అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశం లేకుండా చేసిందని కేంద్ర ప్రభుత్వాన్ని వారు విమర్శించారు ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగాలు భర్తీ చేయకుండా కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ పద్ధతిని కొనసాగిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు యువతకి ఉపాధి అవకాశాలు కల్పించకుండా కేంద్ర ప్రభుత్వాలు యువకులను పక్కదారి పట్టిస్తున్నారని వారు గుర్తు చేశారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువకులకు ఉద్యోగ అవకాశాలు ఉపాధి అవకాశాలు కల్పియకుంటే ప్రభుత్వాలపై తిరుగుబాటు చేయడం తప్పదని వారు అన్నారు మార్చ్ 23న రాష్ట్రవ్యాప్తంగా భగత్ సింగ్ రాజు గురువు సుకుదేవుల వర్ధంతి సభలు నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు అంజనేయులు గ్రామ ప్రధాన కార్యదర్శి మహేష్ ఉపాధ్యక్షులు ప్రశాంత్ కమిటీ సభ్యులు రవి జీసస్ మహేష్ లింగం సంతోష్ వినోదు తదితరులు పాల్గొన్నారు.



## అమరుల, ఉద్యమకారుల త్యాగాన్ని తెలంగాణ పౌరసమాజం అనునిత్యం స్మరించాలి..

### - వారిని అక్కున చేర్చుకునే దిశగా.. మరో ముందడుగు వేయాలి

అశేష తెలంగాణ జనం ఐదు దశాబ్దాలుగా తెలంగాణ రాష్ట్ర కల సాకారం కోసం ఎన్నో త్యాగాలకు పూనుకున్నది. ఈ తెలంగాణ ఉద్యమం కుల, మత, వర్గ, వయో, లింగ బేధాలను మర్చిపోయి వారిలో పోరాట స్ఫూర్తిని రగిలించింది. ఈ ఉద్యమంలో ముఖ్యంగా మేధావులు, సామాజికవేత్తలు,విద్యార్థి, ప్రజా, కుల సంఘాలు, కవులు, కళాకారులు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, కార్మిక వర్గాలు,సింగిల్ ఎజెండాతో ఏకీకరణ భావనతో పలు రాజకీయ పార్టీలు సైతం ఈ ఉద్యమ నేపథ్యానికి తమ సంఘీభావాన్ని, అదే కోణంలో దిశా నిర్దేశనాన్ని చూపించాయి. సబ్బడవర్గాలు సైతం భిన్న రూపాలలో తమ నిరసనలు తెలిపాయి. రాస్తారోకోలు, నిరాహార దీక్షలు, వంటా వార్పులు, రైలురోకోలు, సకలజనుల సమ్మెలు, వాకౌట్లు, బంద్‌లు, ధర్నాలు, ర్యాలీలు, అవగాహనా సదస్సులు, మానవహారాలు లాంటి ఎన్నో నిరసన రూపాలకు శ్రీకారం చుట్టాయి. తెలంగాణ ధూమ్ దాం పేరుతో కళాకారులు, గాయకులు గజ్జ కట్టి ఆడి పాడారు. సమాజాన్ని చైతన్యం దిశగా నడిపించడంలో వారి పాత్ర శ్లాఘనీయమైనది. ప్రధానంగా ఉమ్మడి రాష్ట్రంలో భాషా సంస్కృతులపై, పరిపాలన క్షేత్రంలో ప్రధాన భూమిక పోషించే ప్రధాన పదవుల వాటా పందేరంలో సైత జరిగిన మూకుమ్మడి దాడి నిరసనలతో పాటుగా,తెలంగాణ వెనుకబాటుతనంతో దగా పడిన తెలంగాణ తమ్ముళ్ల అసమ్మతి సెగ చివరగా నీళ్లు, నిధులు, నియామకాలపై జరిగిన నష్ట%శీ% దాకా గ్రహించిన ఆ ఉద్యమం ఆగ్రహంతో ఉవ్వెత్తున ఎగిసి పడింది. మరీ ముఖ్యంగా రాజకీయ నేపథ్యంతో ఉద్యమం జతకట్టడం మూలాన భావోద్వేగంతో ఒక దశాబ్ధకాలం పాటు మాత్రం తమ నిరసన గళాలు మరింత వేగవంతమవటం ద్వారా దగాపడిన నిరుద్యోగ యువత విపరీతమైన భావోద్రేకానికి లోనవడం, అలా చివరగా తమ ప్రాణాలను సైతం ఎదురొడ్డి, కేంద్ర ప్రభుత్వ%శీ% దిగి వచ్చేదాకా, నిలదీసే పోరాటానికి సంసిద్ధులైన సందర్భాలు కోకొల్లలు. మధ్య మధ్యలో ప్రభుత్వాల ప్రజావ్యతిరేక ప్రకటనల నేపథ్య%శీ% వారిని ఆత్మహత్యలకు పురికొల్పింది. సున్నితమైన ఈ సమస్య ఎందరి మనసులనో గాయపరిచింది. ఆ క్రమంలోనే తెలంగాణ మలిదశ ఉద్యమంలో సుమారు 1200కు పైగా తమ ప్రాణాలను బలిదానం చేశారు. పలు రకాల ఈ నిరసన జ్వాలల్లో తెలంగాణ ఉద్యమకారులపై అనేక పోలీస్ కేసులు బనాయించడం ద్వారా నేటికీ ఆ కేసుల్లో తమ విలువైన కాలాన్ని,డబ్బును కోల్పోయారు. చివరికి బంగారు తెలంగాణ కల కూడా వారి ఆశను అడియాసలు చేసింది.

నిజానికి వారి త్యాగంతో గద్దెనెక్కిన ప్రజా ప్రభుత్వాలు వారికి కొండంత అండనివ్వడంలో మాత్రం విఫలమయ్యాయని చెప్పక తప్పదు.వారికి ఊరట కలిగించే దిశగా తెలంగాణ ఆవిర్భావం దశాబ్ది ఉత్సవాల నేపథ్యం సమీపిస్తున్న ఈ శుభ తరుణంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధితో ఆయా కుటుంబ సభ్యులకు ఆర్థిక ప్రోత్సాహాల రూపంలో నైనా, ఏదేని ఉపాధిని కల్పి%శీ%చైనా, లేదా రాజకీయాల్లో నామినేటెడ్ పోస్టుల్లో నియామకం చేసైనా వారి కుటుంబ సభ్యుల ఆత్మ గౌరవాన్ని, ఇనుమడింప చేసే క్రమంలో ఆదుకోవాల్సిన చారిత్రక సత్యాన్ని గుర్తుచేసే క్రమమే ఈ వ్యాసం ప్రధాన లక్ష్యం. ఇది నిజమైన తెలంగాణ అమరవీరులకు సంస్మరణకు మనమిచ్చే ఓ ఘన నివాళి. ఈ విషయంలో,ఈ మధ్యకాలంలో సమస్త పౌరసమాజం కూడా ఆ దిశగా నూతన అడుగులు వేసే ఓ శుభపరిణామాన్ని ఆహ్వానిస్తూనే,వారి త్యాగాలకు ప్రతిఫలాలను అందించే క్రమంలో ప్రజా ఉద్యమానికి ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతో శీఘ్రగతిన తెరదీయాల్సిన చారిత్రక సత్యాన్ని మరువరాదు.

ఇప్పుడున్న అనేకరకాల సమస్యలను లేవనెత్తడంతో పాటుగా ఆ సమస్యల పరిష్కారానికి పలు నిరసన రూపాలతో నిరంతరాయంగా ప్రభుత్వాన్ని నిలదీయడంలో ఇటీవలికాలంలో సామాజికస్పృహ కలిగిన కొందరు మేధావులు ఉద్యమపథక రచించే పనికి పూనుకోవడం ఓ శుభపరిణామం. ఈ పోరాటం ఇలానే కొనసాగి సమస్య పరిష్కారమయ్యే తుది దశ వరకు చేరుకోవడం మరీ మరీ ముఖ్యం. ఈ విషయంలో ప్రస్తుత నూతన ప్రభుత్వాన్ని కదిలించగలిగితే, నిపుణుల బృందం వారి దృష్టికి తేగలిగితే, తెలంగాణ ఉద్యమకారుల కల నిజంగా సాకారమవుతుంది.



**పరాంకుశం రఘు నారాయణ**
గ్రామం:తొర్రూరు
మహబూబాబాద్ జిల్లా
చరవాణి సంఖ్య: 9949749987




## నూతన వదువరులను ఆశీర్వ దించిన ప్రముఖ వ్యాపరవేత్తలు, నాయకులు

**(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి ం**

**మాగి ముఖేష్,బోనకల్లు మార్చి 20:**

ప్రముఖ వ్యాపారవేత చన్నా సుధీర్ కుమార్,ఝాన్సీల కుమారుడు క్రిష్ణ సాకేత్, కటకం లక్ష్మీ నరసయ్య, సుభాషినిల కూతురు నిశ్చయ తాంబూల వేడుకల్లో పాల్గొన్న బొనకల్ రైతు సంఘం మండల కమిటీ సభ్యులు జోనిబోయిన గురవయ్య , చన్నా లక్ష్మీ నరసింహారావు, చన్నా సంపత్ కుమార్, కోరమాండల్ కంపెనీ లిమటెడ్ వారు ఫణి కుమార్ , అనిల్ రెడ్డి, దీపక్ ఫర్టిలైజర్స్ నాగరాజు, కటకం ఉమామహేశ్వర రావు, గుండా పుల్లారావు, గుండా నరేష్, షేక్ నజీర్, వల్లాపురి దుర్గా ప్రసాద్, గద్దె యలమంద, స్వాల్ సురేష్,మరియు ప్రముఖ ప్రముఖ వ్యాపరవేత్తలు, ఫెర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ సేల్స్ ఆఫీసర్స్ అసోసియేషన్స్ ప్రజా సంఘాల నాయకులు అభిమానులు పాల్గొని ఆశీర్వదించినారు.





# బుచ్చిబాబు సినిమా షురూ..



## రామ్‌చరణ్‌తో ఆర్‌సీ-16గా మొదలు

ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్‌చరణ్ ఓ ప్రాజెక్ట్ ఓకే చేసిన క్రమంలో.. తాజాగా ఈ సినిమా పూజా కార్యక్రమం హైదరాబాద్‌లో వేడుకగా జరిగింది. ప్రముఖ దర్శకుడు శంకర్, సుకుమార్, చిరంజీవి, అల్లు అరవింద్, బోనీకపూర్‌తోపాటు పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. పూజా కార్యక్రమం అనంతరం రామ్‌చరణ్ మాట్లాడారు. అతిథులకు కృతజ్ఞతలు చెప్పారు. బుచ్చిబాబు రాసిన కథ తనకెంతో నచ్చిందన్నారు. ప్రేక్షకులు తప్పకుండా ఎంటర్‌టైన్ అవుతారన్నారు. 'ఉప్పెన' తర్వాత బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తోన్న చిత్రమిది. స్పోర్ట్స్ డ్రామాగా... గ్రామీణ నేపథ్యంలో సాగే కథతో ఈ సినిమా సిద్ధం కానున్నట్లు తెలుస్తోంది. రామ్‌చరణ్ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉండనుంది. జాన్వీకపూర్ కథానాయిక. రెహమాన్ స్వరాలు అందించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు కలిసి నిర్మిస్తున్నాయి. ఆర్‌సి16గా ఇది ప్రచారంలో ఉంది. 'పెద్ది' టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. త్వరలోనే రెగ్యులర్ షూట్ మొదలు కానుంది. రామ్‌చరణ్ ప్రస్తుతం 'గేమ్ ఛేంజర్' పనుల్లో బిజీగా ఉండగా, 'దేవర' కోసం జాన్వీ వర్క్ చేస్తున్నారు. ఈ ఓపెనింగ్ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి, నిర్మాత అల్లు అరవింద్, నిర్మాత బోనీ కపూర్, దర్శకుడు సుకుమార్, హీరోయిన్ జాన్వీ కపూర్, సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్.. అలాగే ప్రస్తుతం రామ్ చరణ్‌తో సినిమా చేస్తోన్న డైరెక్టర్ శంకర్ వంటి ప్రముఖులెందరో హాజరయ్యారు. వీరంతా ఉన్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా రామ్ చరణ్, జాన్వీ కపూర్ కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారాయి. ఈ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఫొటోలను మెగా ఫ్యాన్స్ షేర్ చేస్తూ.. టీమ్‌కు శుభాకాంక్షలు చెబుతున్నారు.

# స్పై యాక్షన్ సిరీస్ 'సిటాడెల్' నటి సమంత పోస్టర్ విడుదల

ది ఫ్యామిలీ మ్యాన్, 'ఫర్జీ' లాంటి విజయవంతమైన సిరీస్‌లను అందించిన రాజ్ అండ్ డీకే రూపొందిస్తున్న మరో స్పై యాక్షన్ సిరీస్ 'సిటాడెల్'. ఇందులో వరుణ్ ధావన్, సమంత జంటగా నటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుకి 'సిటాడెల్: హనీ బన్నీ' అనే టైటిల్‌ని ఖరారు చేస్తూ పోస్టర్‌ని విడుదల చేసింది నిర్మాణ సంస్థ. బాలీవుడ్ ప్రముఖ దర్శకనిర్మాత కరణ్ జోహార్ నిర్వహించిన ప్రైమ్ వీడియో ప్రెజెంట్స్ కార్యక్రమంలో ఈ వివరాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ...'నేనింతగా యాక్షన్ చేస్తానని ఏనాడూ ఊహించలేదు. కనీసం ఇందులో భాగమవుతానని చివరిక్షణం వరకూ అనుకో లేదు. ఈ సిరీస్ కోసం శారీరకంగా ఎంతో శ్రమించా. రాజ్, డీకే చాలా ప్రతిభావంతులు. అమెరికన్ 'సిటాడెల్'ని భారతీయ ప్రేక్షకులకు అందిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అంటూ చెప్పుకొచ్చింది. 'ఇదొక అద్భుతమైన స్పై యాక్షన్ థ్రిల్లర్. ఇందులోని సన్నివేశాలు, ప్రేమకథ ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి' అని తెలిపింది సిరీస్ బృందం. కే కే మేనన్, సిమ్రాన్ తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ ప్రాజెక్టు అమెజాన్ ప్రైమ్‌లో త్వరలో విడుదల కానుంది.



# బిజీ షెడ్యూల్ కారణంగా చిరు ఆఫర్ తిరస్కరణ

కొందరు అగ్ర హీరోలు తమ సినిమాల్లోని కీలక పాత్రకు ఫలానా నటుడైతేనే న్యాయం చేస్తారని భావిస్తారు. ఎలాగైనా వారితో నటింపజేసేందుకు ప్రయత్నిస్తారు. కానీ, కొన్ని సందర్భాల్లో అది వీలుపడదు. ఎవరినైతే యాక్ట్ చేయించాలని అనుకుంటారో వారు అప్పటికే ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండడంతో డేట్స్ ఖాళీ లేక వచ్చిన అవకాశాన్ని సున్నితంగా తిరస్కరిస్తారు. ఇలా జరగడం అన్ని చిత్ర పరిశ్రమల్లో సాధారణమేగానీ దాదాపు నాలుగేళ్ల తర్వాత.. అదే హీరో అదే నటుడికి మరో ఆఫర్ ఇవ్వగా.. ఆ యాక్టర్ తొలుత ఏ ప్రాజెక్టు వల్ల తిరస్కరించారో రెండోసారి కూడా అదే మూవీ వల్ల 'నో' చెప్పడమనేది అరుదు. టాలీవుడ్ ప్రముఖ హీరో చిరంజీవి తన సినిమాల కోసం మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌ను సంప్రదించగా ఆయన తిరస్కరించారు. నాటి సంగతులను పృథ్వీరాజ్ తాజాగా పాల్గొన్న ఇంటర్వ్యూలో నెమరువేసుకున్నారు. హిస్టారికల్ ఫిల్మ్ 'సైరా'లో ఓ పాత్ర కోసం చిరంజీవి నన్ను సంప్రదించారు. అందులో నటించాలనే ఆసక్తి ఉన్నా సాధ్యపడలేదు. 'సర్ నేను ఆడుజీవితం అనే లార్జన్‌దేన్ లైఫ్ సినిమా చేయబోతున్నా. కాల్షీట్లు మొత్తం దానికే కేటాయించా' అని చెబితే ఆయన పరిస్థితి అర్థం చేసుకున్నారు. కొన్నాళ్ల తర్వాత తాను హీరోగా తెలుగులో 'లూసిఫర్' రీమేక్‌ను తెరకెక్కించాలని కోరారు.



# గుంటూరు కారంపై క్రికెటర్ అశ్విన్ ప్రశంసలు..

మహేశ్‌బాబు నటించిన సరికొత్త చిత్రం 'గుంటూరు కారం'పై భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల వర్షం కురిపించారు. ఇదొక వినోదాత్మక చిత్రమన్నారు. తనకెంతో నచ్చిందన్నారు. ప్రధాన నటీనటుల డ్యాన్స్ చూసి ఆశ్చర్యపోయానన్నారు. 'మహేశ్ నటించిన 'గుంటూరుకారం' చూడకపోతే చూడండి. ఎంటర్‌టైనింగ్ మూవీ. శ్రీలీల డ్యాన్స్ అదరగొట్టేసింది. మహేశ్‌బాబు మంచి డ్యాన్సర్. ఆయనతో కలిసి శ్రీలీల అద్భుతంగా డ్యాన్స్ చేసింది అని ఓ ఇంటర్వ్యూలో అశ్విన్ చెప్పారు. మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వచ్చిన మూడో చిత్రమిది. తల్లి సెంటిమెంట్‌తో యాక్షన్ డ్రామాగా దీనిని తీర్చిదిద్దారు. శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలు. ప్రకాశ్‌రాజ్, జగపతిబాబు, రమ్యకృష్ణ, జయరాం, మురళీ శర్మ, రావు రమేశ్ కీలకపాత్రలు పోషించారు. ఎన్నో అంచనాల మధ్య సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ చిత్రం మంచి స్పందనలు సొంతం చేసుకుంది. 'కుర్చీమడతపెట్టి' పాటలో మహేశ్‌బాబు - శ్రీలీల డ్యాన్స్ అభిమానులను ఉర్రూతలూగించింది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రస్తుతం ఇది అందుబాటులో ఉంది.

